# వసతి గృహ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు.

**-ప్రత్తిపాడు ఎస్సీ హాస్టల్‌కు ఆర్వో ప్లాంట్,విద్యార్థులకు సామాగ్రి అందజేసిన ఎమ్మెల్యే సత్యప్రభ**

**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్,జూలై 19:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా సందర్శించారు.ప్రభుత్వం తరఫున విద్యార్థుల వసతి అవసరాల కోసం దుప్పట్లు,పడకలు,నైట్‌డ్రెస్‌లను పంపిణీ చేయడంతో పాటు హాస్టల్‌కు ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అందజేశారు.అనంతరం హాస్టల్ కిచెన్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే సత్యప్రభ విద్యార్థులతో మాట్లాడి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.హాస్టల్‌లో అందుతున్న భోజనం,వసతి సౌకర్యాలపై ఆరా తీశారు.విద్యార్థులకు మెరుగైన వసతి కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమల శాఖ వైస్ చైర్మన్ కొమ్ముల



కన్నబాబు,బిజెపి నాయకులు సింగిలిదేవి సత్తిరాజు,ప్రత్తిపాడు సిహెచ్సి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెలుగుల నాని,మండల జనసేన అధ్యక్షులు రామకుర్తి కామేష్,మండల కూటమి నాయకులు యర్రాబత్తుల గోవిందు నాయుడు,ఇళ్ల అప్పారావు,కుండల అప్పారావు, పాల్గొన్నారు.

పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# రాష్ట్ర ఎస్.టి. కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి జల్దాం గ్రామంలో పర్యటన.....








**శంఖవరం / రౌతులపూడి పెన్ పవర్ జూలై 19:-** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్.టి. కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి రౌతలపూడి మండలంలోని జల్దాం గ్రామంలో ఏర్పాటు చేసిన గిరిజన ప్రజా సమస్యల సభలో పాల్గొన్నారు.

సభ నిర్వహణకు కొన్ని అడ్డంకులు ఎదురైనప్పటికీ, గిరిజనులు భారీ సంఖ్యలో హాజరై చైర్మన్ ఘన స్వాగతం పలికారు. సభ ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా జరిగింది.ఈ సందర్భంగా చైర్మన్ వివిధ గ్రామాల నుంచి వచ్చిన గిరిజన ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రౌతలపూడి మండలంలోని అనేక గిరిజన గ్రామాల్లో అభివృద్ధి పూర్తిగా నిలిచి పోయిందని గ్రామస్తులు చైర్మన్ దృష్టికి తీసుకు వచ్చారు. గ్రామాలకు సరైన రహదారులు లేవని, తాగునీటి సౌకర్యం లేదని, పక్కా గృహాలు మంజూరు కాలేదని, భూముల సర్వేలు జరగలేదని వారు వివరించారు.

జల్దాం గ్రామ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న మైనింగ్ కార్యకలాపాల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు తెలిపారు. ప్రతిరోజూ సుమారు 500 మైనింగ్ లారీలు రాకపోకలు సాగించడం వల్ల ప్రజలు బయటకు వెళ్లేందుకు కూడా భయపడుతున్నారని చెప్పారు.

గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయని, గుంతలు ఏర్పడి రాకపోకలు కష్టంగా మారాయని, ఇళ్లలోకి అధికంగా దుమ్ము చేరి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని, మైనింగ్ కారణంగా కాలుష్యం పెరుగుతోందని తెలిపారు. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ మైనింగ్ వల్ల కలుగుతున్న ఇబ్బందులను నివారించాలని చైర్మన్ కోరారు.

అదేవిధంగా, అనేక మంది గిరిజనులకు ఇప్పటికీ కుల ధ్రువీకరణ పత్రాలు అందలేదని, దీనివల్ల ఉన్నత విద్యను కొనసాగించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వివరించారు. గ్రామాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు లేకపోవడం వల్ల వైద్య సేవలు అందడం లేదని తెలిపారు. అలాగే పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు కూడా లేకపోవడంతో చిన్నారుల విద్య దెబ్బతింటోందని పేర్కొన్నారు.

పెద్దమలాపురాన్ని మండల కేంద్రంగా ప్రకటించి మినీ ఐటిడిఏ ఏర్పాటు చేయాలని గిరిజనులు విజ్ఞప్తి చేశారు. రంపచోడవరం, కాకినాడ ప్రాంతాలు దూరంగా ఉండటం వల్ల పరిపాలనా సేవలు పొందడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అదేవిధంగా గిరిజన ఆదివాసీ భవనం నిర్మించాలని, పెద్దూరు నుంచి గిన్నెరం గ్రామం వరకు సరైన రహదారి నిర్మించాలని కోరారు.

గిరిజనుల సమస్యలను పూర్తిగా విన్న అనంతరం చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.


# మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడకు ఘన నివాళులు.

**-ఏనుగు వీధి రామాలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ**



**కిర్లంపూడి,పెన్ పవర్, జూలై, 19:**మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత స్వర్గీయ ముద్రగడ పద్మనాభం మృతికి సంతాపక సూచికంగా ఏనుగు వీధి రామాలయ కమిటీ సభ్యులు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. రామాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీలో కమిటీ సభ్యులు,స్థానికులు పాల్గొని ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభం ప్రజా సేవలను, కాపు సామాజిక వర్గం కోసం ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ప్రజా సమస్యలపై ఆయన చూపిన చిత్తశుద్ధి, పోరాట స్ఫూర్తి ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు."నీతి, నిజాయితీ, పట్టుదల, ఆప్యాయత, నైతిక విలువలతో జీవించిన మీరు మమ్మల్ని విడిచి వెళ్లడం ఎంతో బాధాకరం.మీరు లేని లోటు తీరనిదని,మీరు ఎక్కడ ఉన్నా మా హృదయాల్లో చిరస్మరణీయులుగా నిలిచిపోతారని మీ ఆత్మకు శాంతి కలగాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నామని ఘన నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో ఏనుగుది రామల కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో స్థానిక యువకులు పాల్గొన్నారు.

# డ్రోన్ నిఘాతో అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం




**కాకినాడ జిల్లా పోలీసుల నిరంతర పర్యవేక్షణ**

**కాకినాడ, పెన్ పవర్ జూలై 19:** జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల భద్రత, అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ డ్రోన్ నిఘాను మరింత విస్తృతంగా కొనసాగిస్తున్నట్లు కాకినాడ జిల్లా పోలీసులు తెలిపారు.జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఆదేశాల మేరకు ఆదివారం కాకినాడ ఎన్టీఆర్ బీచ్ పరిసర ప్రాంతాల్లో తిమ్మాపురం పోలీసులు డ్రోన్‌లతో ప్రత్యేక నిఘా నిర్వహించారు. బీచ్ ప్రాంతంతో పాటు నిర్మానుష్య ప్రదేశాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలు, అనుమానాస్పద ప్రాంతాలపై డ్రోన్ కెమెరాల ద్వారా పర్యవేక్షణ చేపట్టి పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలించారు.అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా పలు పోలీస్ స్టేషన్ పరిధుల్లో కూడా డ్రోన్‌ల సహాయంతో నిఘా కొనసాగిస్తున్నారు. జూదం, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం,మాదకద్రవ్యాల అక్రమ రవాణా, అనుమానాస్పద వ్యక్తుల సంచారం వంటి చట్టవ్యతిరేక చర్యలను గుర్తించి అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు.డ్రోన్ నిఘా ద్వారా చట్టవ్యతిరేక



కార్యకలాపాలకు పాల్పడే వారిని వేగంగా గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేందుకు అవకాశం కలుగుతుందని పోలీసులు పేర్కొన్నారు. ప్రజల భద్రత, నేరాల నియంత్రణ, జిల్లాలో ప్రశాంత వాతావరణం కొనసాగించేందుకు ఇటువంటి డ్రోన్ నిఘా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా చట్టవ్యతిరేక కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-112కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని జిల్లా పోలీసులు విజ్ఞప్తి చేశారు.



# శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయంలో భక్తుల రద్దీ..




**నిత్య అన్నదాన పథకానికి విరాళం అందించిన భక్తులు**




**ఆత్రేయపురం పెన్ పవర్ జూలై 19:**ఆత్రేయపురం మండలం ర్యాలి గ్రామంలో వెలసి ఉన్న అతి పురాతన శ్రీ జగన్మోహిని కేశవస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ ఆలయంలో వరుసగా ఐదు బుధవారాలు ఐదు ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం.

ఆదివారం పెద్ద సంఖ్యలో విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం ఆలయ సన్నిధిలో నిర్వహిస్తున్న అన్నప్రసాద సేవలో పాల్గొని భోజనం చేశారు. పలువురు భక్తులు ఆలయ అభివృద్ధి కోసం ఉదారంగా విరాళాలు సమర్పించారు.విజయవాడకు చెందిన కస్తూరి కృష్ణ అభిషేక్ -- శ్రీవత్సల దంపతులు రూ.5,116 విరాళంగా అందజేశారు. అలాగే గుడివాడకు చెందిన తమ్మన నాగ వెంకట పవన్ కుమార్ కుటుంబ సభ్యులు రూ.5,116, తెనాలికి చెందిన డా. సోమిశెట్టి మహేష్ కిరణ్ పావని ప్రియాంక దంపతులు రూ.5,116 చొప్పున ఆలయానికి విరాళంగా సమర్పించారు.విరాళాలు అందించిన భక్తులకు ఆలయ అర్చకులు స్వామివారితో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వేదపండితులు వెంకట అవధాని వేదాశీర్వచనం చేయగా, ఆలయ జూనియర్ అసిస్టెంట్ ఎం. శ్రీనివాస్ స్వామివారి చిత్రపటాన్ని శాసనసత్కారంతో అందించి ఘనంగా సన్మానించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# పేదలకు తక్కువ ధరల్లో వైద్య పరీక్షలు అందించడం అభినందనీయం

**కలెక్టర్ హరేంధిర ప్రసాద్**

**కాకినాడ,పెన్ పవర్ జూలై 19:** పేదలు, మధ్యతరగతి ప్రజలకు అత్యల్ప ధరల్లో నాణ్యమైన క్లినికల్ పరీక్షలు అందిస్తూ లాభాపేక్ష లేకుండా సేవలందిస్తున్న బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ సమాజానికి ఆదర్శంగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అన్నారు.ఆదివారం డి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ మూడో వార్షికోత్సవ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో శ్రావణి ఈఎన్‌టీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ సత్తి వీర్రెడ్డి, పైడా విద్యాసంస్థల చైర్మన్ పైడా కృష్ణప్రసాద్ గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. ల్యాబ్‌కు ఆర్థిక సహకారం అందిస్తున్న దాతలను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.కలెక్టర్ మాట్లాడుతూ,గతంలో సాధారణ ల్యాబ్ పరీక్షలకు వందల రూపాయలు ఖర్చవుతుండగా,ప్రస్తుతం అదే పరీక్షలకు వేల రూపాయలు వెచ్చించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు.తాను ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈఓగా పనిచేసిన సమయంలో పేదలకు ల్యాబ్ పరీక్షల ఖర్చు ఎంతటి భారంగా ఉండేదో ప్రత్యక్షంగా చూశానని గుర్తు చేశారు.బయట రూ.1,500 నుంచి రూ.2,000 వరకు ఖర్చయ్యే 2డీ ఎకో పరీక్షను ఈ ల్యాబ్‌లో కేవలం రూ.650కే నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. వ్యాధుల కారణంగా అనేక కుటుంబాలు అప్పుల పాలవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఇలాంటి సేవా సంస్థలు మరింత అవసరమన్నారు.




క్యాన్సర్ వంటి వ్యాధుల నివారణలో స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని, యువత సేవా కార్యక్రమాల పట్ల మరింత ఆసక్తి కనబరచాలని పిలుపునిచ్చారు. ప్రజా-ప్రైవేటు భాగస్వామ్యంతో ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు.ల్యాబ్ చైర్మన్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ,ఇప్పటివరకు 11 సేవా సంస్థలను ఏర్పాటు చేసి ప్రజాసేవ చేస్తున్నామని చెప్పారు.దాతల సహకారంతోనే పేదలు,మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన క్లినికల్ పరీక్షలను అత్యల్ప ధరలకు అందించగలుగుతున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో వైద్యులు, దాతలు, ప్రజాప్రతినిధులు,సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

